క్లుప్తంగా

కూలిన ఇంటి గోడ



వాజేడు: మండల పరిధిలోని గుమ్మడిదొడ్డి గ్రామంలో గాలికి ఇంటి గోడ కూలింది. బాధితుడు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం ఉదయం ఉరుములు, మెరుపులతో గాలి వీచింది. ఆ సమయంలో చిరు జల్లులు సైతం పడ్డాయి. గాలి ఉధృతంగా రావడంతో మొడెం సురేష్ ఇంటికి చెందిన సిమెంట్ ఇటుకల గోడ కూలి పోయింది. ఎవరికి ఎలాంటి ప్రమాదం జరుగలేదు.

ఇల్లు ఇప్పించండి..



గోవిందరావుపేట: ఉరుములు, మెరుపులు, భీకరమైన గాలి వాన వస్తుండగా ఇల్లు సరిగా లేక భయంతో బాత్రూంలో పడుకున్న అంటూ చల్వాయి గ్రామానికి చెందిన పసులాది ధన పలువురితో చెప్పుకుంటూ కన్నీటి పర్యంతమయ్యింది. వివరాలు ఇలా ఉన్నాయి. పసులాది ధన భర్త భద్రయ్య అనారోగ్యంతో మూడు సంవత్సరాల క్రితం మృతి చెందాడు. కాగా, ఇంత వరకు వితంతువు ఫించన్ కూడా రావడం లేదు. ఇద్దరు ఆడపిల్లలని చదివిస్తూ, ఇల్లు లేక ఉన్న ఇంటి స్థలంలో చుట్టూ పరదాలతో కట్టుకున్న గుడిసెలో నివసిస్తుంది. గురువారం రాత్రి కురిసిన వర్షానికి భయమేసి బాత్రూంలో పడుకున్నానని తనకు ఇల్లు వచ్చేలా చేయండి అంటూ గ్రామంలోని నాయకుల కాళ్ల వేళ్ల పడుతూ అడగడం పలువురిని కంటతడి పెట్టించింది. తన లాంటి నిరుపేదకు ఇల్లు వచ్చేలా చూడాలని మంత్రి సీతక్కను, నాయకులను ధన వేడుకుంటుంది.

ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలి

మంగపేట: మండలంలోని రాజుపేట జామియా మసీద్ కమిటీ ఆధ్వర్యంలో జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రమూకల దాడిని ఖండిస్తూ ముస్లింలు శుక్రవారం నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా మసీద్ కమిటీ అధ్యక్షుడు ఇషాక్ మాట్లాడుతూ.. భారతదేశంలో ప్రజలందరూ కులం మతం అనే తేడా లేకుండా హిదూముస్లింలు కలిసి మెలిసి స్నేహభావంతో నివసిస్తున్నామన్నారు. దాడికి పాల్పడిన ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో మజ్జిద్ మహ్మద్ ఇస్మాయిల్, జిక్రియ, దావూద్, కౌషల్, జహంగీర్, హుస్సేన్, అక్బర్, రఫీ, ముస్లిం కుల పెద్దలు యువకులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ఏటూరునాగారం: రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలైన సంఘటన మండలంలోని చిన్నబోయినపల్లి గ్రామ సమీపంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు ఏటూరునాగారం నుంచి హనుమకొండకు వెళ్తున్న ఆర్టీసీ బస్సు, మెట్టుపల్లి గ్రామం నుంచి వాజేడుకు వెళ్తున్న ఆటో చిన్నబోయినపల్లి వే బ్రిడ్జి వద్ద జాతీయ రహదారిపై ప్రమాదవశాత్తు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న ఇల్లందుకు చెందిన ప్రశాంత్‌కు, వాజేడు గ్రామానికి చెందిన వెంకటలక్ష్మికి గాయాలయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

గుండెపోటుతో యువకుడి మృతి



కుమారస్వామి (ఫైల్)

ములుగు: గుండెపోటుతో యువకుడు మృతి చెందిన సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. జిల్లాకేంద్రానికి చెందిన రాజమల్లు–రాజక్కల కుమారుడు జక్కుల కుమార్(38) భార్య కల్యాణి ఆదిలాబాద్ జిల్లాకేంద్రంలోని మైనార్టీ వెల్ఫేర్ గురుకులంలో జూనియర్ లెక్చరర్‌గా పనిచేస్తుంది. కాగా, కుమారస్వామి దంపతులు గురువారం ఆదిలాబాద్‌కు వెళ్లేందుకు ప్రయాణమయ్యారు. ముందుగా భార్యకు ఆర్టీసీ రిజర్వేషన్ టికెట్ తీసుకున్న కుమారస్వామి ద్విచక్రవాహనంపై గురువారం ఉదయం ఆదిలాబాద్‌కు బయలు దేరాడు. కరీంనగర్ సమీపంలో గుండెనొప్పిగా అనిపించడంతో ప్రభుత్వ ఆసుపత్రిలో చేరాడు. వైద్యుల సూచన మేరకు ప్రైవేటు ఆస్పత్రిలో చేరాడు. అర్ధరాత్రి వరకు ఆరోగ్యంగా కనిపించిన కుమారస్వామి శుక్రవారం ఉదయం గుండెపోటుతో మృతి చెందాడు.

అభివృద్ధికి నోచని ఆలయం

- బొగత వద్ద వెలిసిన లక్ష్మీనర్సింహస్వామి
- రేకుల షెడ్డులోనే పూజలు
- జూన్‌లో స్వామివారి కల్యాణం

వాజేడు: పర్యాటకులను ఆకట్టుకోవడానికి అటు ప్రభుత్వం, ఇటు అటవీశాఖ ప్రత్యేక శ్రద్ధను కనబరుస్తూ అందుకు తగ్గట్టుగా మండల పరిధిలోని చీకుపల్లి అటవీ ప్రాంతంలోని బొగత జలపాతాన్ని తీర్చిదిద్దారు. ప్రత్యేక వసతులను కల్పిస్తూ పర్యాటకరంగంగా అభివృద్ధి చేశారు. జలపాతం సమీపంలో జలదారలకు ఎదురుగా ఉన్న గుట్టపై ప్రకృతి ఒడిలో లక్ష్మీనర్సింహస్వామి 2000 సంవత్సరంలో వెలిశాడు. నాటి నుంచి నేటి వరకు నిత్య పూజలు అందుకుంటున్న లక్ష్మీనర్సింహస్వామిని మాత్రం ఎవరూ పట్టించుకోవడం లేదు. దేవుడు వెలిసిన నాటి నుంచి నేటి వరకు మండల పరిధిలోని కోయ వీరాపురం గ్రామానికి చెందిన ఉయిక రాంబాయి గిరిజన మహిళా పూజారి నిత్యపూజలను చేయడంతో పాటు ప్రతీ ఏడాది జూన్‌లో సొంత ఖర్చులతో స్వామివారి కల్యాణం నిర్వహిస్తోంది. పలు గ్రామాలకు చెందిన భక్తులు ప్రతీ శనివారం ఇక్కడికి వచ్చి పూజలు నిర్వహిస్తారు. అలాగే జలపాతానికి వచ్చే పర్యాటకులు సైతం దేవుడి దర్శనం చేసుకుంటున్నారు. అయినప్పటికీ ఆయన నిర్మాణం, దీప, దూప నైవేద్యాలకు కావాల్సిన నిధులను మాత్రం అటు ప్రభుత్వాలు, ఇటు అధికారులు కేటాయించడం లేదు. దీంతో స్వామి వారి ఆలయం అభివృద్ధికి నోచుకోవడం లేదు.

రేకుల షెడ్డులోనే పూజలు

స్వామి వారికి ఆలయం లేకపోవడంతో కోయ వీరాపురం గ్రామస్తుల సహకారంతో చిన్నరేకుల షెడ్డును నిర్మించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు బొగతను చూసి స్వామి వారిని దర్శించుకున్నా అభివృద్ధిని మాత్రం పట్టించుకోవడం లేదు. దీంతో లక్ష్మీనర్సింహస్వామి రేకుల షెడ్డులోనే పుజలందుకుంటున్నాడు. ఈ పూజలను గిరిజన మహిళ రాంబాయి నిర్వహించడం ఇక్కడ ప్రత్యేకత.

108 మెట్లకు హామీ ఏమైనట్లు?

ఉమ్మడి జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టర్‌గా పని చేసిన సమయంలో ఆకునూరి మురళి బొగత జలపాతాన్ని సందర్శించారు. ఆ సమయంలో గుడి ఉన్న విషయం తెలుసుకున్న ఆయన భక్తులు పైకి వెళ్లడానికి వీలుగా 108 మెట్లకు నిధులు మంజూరు చేస్తానని పూజారికి హామీ ఇచ్చారు. నిధులు మంజూరు చేయకముందే కలెక్టర్ మురళి బదిలీపై వెళ్లడంతో హామీ మరుగునపడింది. రాళ్లపై నుంచి పైకి వెళ్తున్న భక్తులు జారి కింద పడుతుండటంతో చలించిన పూజారి రాంబాయి ఆధ్వర్యంలో దాతల సహకారంతో తాత్కాలికంగా చిన్న మెట్లను నిర్మించారు. అలాగే ఆలయాన్ని రామానుజ స్వామి ఒకసారి, ఆయన శిష్యులు పలుమార్లు సందర్శించారు. టీటీడీ ఆధ్వర్యంలో చేపట్టిన మన గుడి కార్యక్రమంలో భాగంగా ఈ గుడిని చూశారు. అయినప్పటికీ ఎలాంటి పురోగతి లేదు.

బొగత జలపాతానికి ప్రతీ రోజు వేలాది సంఖ్యలో పర్యాటకులు తరలివస్తుంటారు. సుదూర ప్రాంతాల నుంచి తరలివచ్చిన పర్యాటకుల్లో ఎక్కువ మంది భక్తులు ఉంటున్నప్పటికీ స్వామి వారిని మనస్ఫూర్తిగా దర్శించుకునే అవకాశం లేకుండా పోతుంది. ప్రభుత్వం, అధికారులు గుడిని అభివృద్ధి చేయాలని పలువురు కోరుతున్నారు.



రేకుల షెడ్డుతో ఉన్న లక్ష్మీనర్సింహస్వామి ఆలయం



లక్ష్మీనర్సింహస్వామి మూల విరాట్

అభివృద్ధి చేయాలి



బొగత జలపాతం వద్ద వెలిసిన లక్ష్మీనర్సింహస్వామి ఆలయానికి ప్రభుత్వం నిధులు కేటాయించి అభివృద్ధి చేయాలి. ప్రతీ రోజు నేను స్వామివారికి పూజలు చేస్తా. అలాగే ప్రతి ఏడాది సొంత నిధులతో స్వామి వారి కల్యాణం నిర్వహిస్తున్నాను. బొగతకు వచ్చిన పర్యాటకులు స్వామి వారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకుంటారు.

– రాంబాయి, గిరిజన మహిళా పూజారి

వ్యాధులపై అప్రమత్తత అవసరం



పెనుగోలు కాలనీలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

- హెచ్‌ఈఓ వేణుగోపాలకృష్ణ

వాజేడు: వ్యాధులపై అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని హెచ్‌ఈఓ వేణుగోపాలకృష్ణ అన్నారు. మండల పరిధిలోని పెద్ద గంగారం గ్రామంలో పేరూరు వైద్య సిబ్బంది శుక్రవారం సికిల్ సెల్ వ్యాధి నిర్ధారణ పరీక్షలను చేశారు. ఈ సందర్భంగా వేణుగోపాలకృష్ణ మాట్లాడుతూ.. జిల్లా వైద్యాధికారి గోపాలరావు ఆదేశాల మేరకు ఈ పరీక్షలను నిర్వహించినట్లు తెలిపారు. కొన్ని ప్రతికూల పరిస్థితులు, జీవన విధానంలో వచ్చిన మార్పుల వలన సికిల్ సెల్ వ్యాధి వచ్చే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో తిరుపతి, సుమలత, ఆశకార్యకర్త ఉన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మండల వైద్యాధికారి మధుకర్ అన్నారు. మండల కేంద్రంలోని పెనుగోలు కాలనీలో ఎంపీఓ శ్రీకాంత్ నాయుడుతో కలిసి ఫ్రైడే, డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. నిల్వ నీటిని పారబోయడంతో పాటు పలు సూచనలను సలహాలను ఇచ్చారు. అనంతరం గ్రామంలో వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వెంకట రమణ, కోటిరెడ్డి, చిన్న వెంకటేశ్వర్లు, రాజేశ్వరి, శాంత కుమారి, లక్ష్మి తదితరులు ఉన్నారు.

పారిశుద్ధ్య పనులు



పిచ్చి మొక్కలను తొలగిస్తున్న సిబ్బంది

వాజేడు: మండల కేంద్రంలోని నాగారం గ్రామ పంచాయతీలో శుక్రవారం ఎంపీఓ శ్రీకాంత్ నాయుడు ఆధ్వర్యంలో పారిశుద్ధ్య పనులను నిర్వహించారు. ముందుగా తాగు నీటి ట్యాంకులను బ్లీచింగ్‌తో శుభ్రం చేశారు. ప్రజలకు స్వచ్ఛమైన తాగు నీరు అందించాలని గ్రామ పంచాయతీ సిబ్బందికి ఎంపీఓ ఆదేశించారు. గ్రామాల్లోని మురుగు నీటి కాలవ్లో పేరుకుపోయిన చెత్తను తీయించారు. రహదారుల వెంట ఉన్న పిచ్చి మొక్కలను తొలగింపజేశారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి ప్రభాకర్ ఉన్నారు.

ఇసుక క్వారీని అడ్డుకుంటున్నారని నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు

మంగపేట: మండలంలోని రమణక్కపేట కొమరం భీం గిరిజన లేబర్ ఇసుక సొసైటీ ఆధ్వర్యంలో ఇసుక క్వారీ నిర్వహణ కోసం గ్రామసభ నిర్వహించకుండా కలెక్టర్ టీఎస్ దివాకర పొంతనలేని సమాధానం చెపుతూ అడ్డుకుంటున్నారని రమణక్కపేట గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఈ మేరకు గ్రామ ఇసుక క్వారీ వద్ద గ్రామస్తులు కలెక్టర్ తీరుపై శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. మార్చి 28న రమణక్కపేట 02, గొల్లగూడెం ఇసుక క్వారీల నిర్వహణపై గ్రామసభ నిర్వహించనునట్లు ఎంపీడీఓ ద్వారా సర్క్యులర్ జారీ చేశారని అనంతరం కలెక్టర్ ఆదేశాల మేరకు వాయిదా వేస్తునట్లు ప్రకటించారని పేర్కొన్నారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు తిరిగి నిర్వహించలేదని పలుమార్లు, ఇసుక సొసైటీ నిర్వాహకులు, గ్రామస్తులు కలెక్టర్‌ను కలిసి స్వయంగా కలిసి గ్రామసభ నిర్వహించాలని అడిగిన ప్రతిసారి రెండు గ్రామాల మధ్య గొడవలు ఉన్నాయని, మరోసారి మంత్రి ఆపమన్నారని పొంతన లేని సమాధానం చెపుతూ అడ్డుకుంటున్నారని ఆరోపించారు. అన్ని క్వారీల నిర్వహణకు పెసా గ్రామసభలు నిర్వహించి క్వారీలు ప్రారంభం అయినా రమణక్కపేట క్వారీపై గ్రామసభ నిర్వహించకపోవడం వెనుక ఆంతర్యం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. ఆదివాసీ గిరిజనులు క్వారీ నిర్వహణ చేయకుండా అడ్డుకుంటూ తనకు అనుకూలమైన కాంట్రాక్టర్లతో కుమ్మక్కై గ్రామసభ నిర్వహించకుండా అడ్డుకుంటున్నారని ఆరోపించారు. దీంతో తమకు ఉపాధి లేకుండా పోతుందన్నారు. ఇప్పటికైనా పెసా గ్రామసభ నిర్వహించి ఇసుక క్వారీ నిర్వాహణ కొనసాగించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.

అర్హులకే ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

వాజేడు: అర్హులకే ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని కోరుతూ శుక్రవారం మండల కేంద్రంలోని సతపాకల నుంచి ఎంపీడీఓ కార్యాలయ వరకు సీపీఎం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. అనంతరం ఎంపీడీఓ విజయకు వినతిపత్రాన్ని ఇచ్చారు. ఈ సందర్భంగా సీపీఎం పార్టీ మండల కార్యదర్శి కొప్పుల రఘుపతిరావు మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల అర్హుల కోసం సర్వే చేసిన లిస్టును పక్కన పెట్టి అధికార పార్టీ నాయకులు సూచించిన అభ్యర్థుల పేర్లు లిస్టులో పెడుతున్నారని ఆరోపించారు. అనంతరం ఎంపీడీఓ విజయ మాట్లాడుతూ అర్హులకే ఇందిరమ్మ ఇళ్లు వస్తాయని, పుకార్లు నమ్మొద్దన్నారు. ఈ కార్యక్రమంలో జెజ్జరి దామోదర్, బచ్చలి కృష్ణ బాబు, గుగ్గిళ్ల దేవయ్య, సౌమ్య, సంతోష్, ముత్తయ్య, రమాదేవి, శాంతకుమారి, లింగయ్య, కృష్ణ బాబు తదితరులున్నారు.

అకాల వర్షం.. అపార నష్టం



రేగొండ: నేలవాలిన మొక్కజొన్న చేనును చూపిస్తున్న రైతు

మల్హర్ : మండలంలో గురువారం అర్ధరాత్రి కురిసిన అకాల వర్షానికి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఆరబోసిన ధాన్యం తడిసి ముద్దయింది. భారీ వర్షం కారణంగా రైతులకు అపార నష్టాన్ని మిగిల్చింది. మండలంలోని తాడిచర్ల, మల్లారం, పెద్దతూండ్ల, కొయ్యూరు తదితర గ్రామాల్లో ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో నిల్వ ఉన్న ధాన్యం కొట్టుక పోయింది. అలాగే ధాన్యం కుప్పల మీద టార్పాలిన్లు కప్పినా వర్షం ఎక్కువగా కురవడంతో వరదనీరు కుప్పల కిందికి చేరింది. కొన్ని ప్రాంతాల్లో కోతలకు సిద్ధంగా ఉన్న వరి పొలాల్లోనే నేలకొరిగి, వడ్లు రాలిపోయాయి. చేతి కొచ్చిన పంట నీళ్ల పాలవుతుండటంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాలు అధికం కాక ముందే అధికారులు ధాన్యం సేకరణ పనులు వేగవంతం చేయాలని రైతులు కోరుతున్నారు.

రామన్నగూడెంలో..

రేగొండ : మండలంలోని రామన్నగూడెంలో గురువారం రాత్రి కురిసిన వర్షానికి గ్రామానికి చెందిన మోతె రాజిరెడ్డికి చెందిన రెండు ఎకరాల్లో సాగు చేస్తున్న మొక్కజొన్న పంట నేలవాలింది. పంట చేతికొచ్చే తరుణంలోనే మాయదారి వర్షం నట్టేటా ముంచిందని రైతులు కన్నీటిపర్యంతం అవుతున్నారు. పసుల అనిల్, గొల్లపల్లి మల్లయ్యకు చెందిన ఇంటిపై కప్పులు ఎగిరిపడ్డాయి. ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసి ఆదుకోవాలని కోరుతున్నారు.

క్యాంపును సద్వినియోగం చేసుకోవాలి



సమ్మర్ క్రీడా క్యాంపును ప్రారంభిస్తున్న నాయకులు

వెంకటాపురం(కె): తైకాండో సమ్మర్ క్రీడా క్యాంపును బాల బాలికలు సద్వినియోగం చేసుకోవాలని తైకాండో మాస్టర్ గొంది హనుమంత్ తెలిపారు. శుక్రవారం కాఫెడ్ స్వచ్ఛంద సంస్థ కరీడా మైదానంలో సమ్మర్ క్రీడా క్యాంపును ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సయ్యద్ హుస్సేన్, సంతోష్, కాఫెడ్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ లూర్దురాజు ఉన్నారు.

రైతులు అధైర్యపడొద్దు

- పస్రా ఎస్సై కమలాకర్



రైతులతో మాట్లాడుతున్న పస్రా ఎస్సై కమలాకర్

గోవిందరావుపేట: రైతులు అధైర్య పడొద్దని పస్రా ఎస్సై కమలాకర్ అన్నారు. చల్వాయి గ్రామంలోని కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించి రైతుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. 20 రోజుల నుంచి కురుస్తున్న అకాల వర్షాలకు ధాన్యం నీళ్ల పాలు అవుతుంటే రైతులు కన్నీరు మున్నీరవుతున్నారు. మిల్లర్లు పలు కొర్రీలు పెడుతూ ఇబ్బందులు పెడుతున్నారని, లారీలు కూడా సరిగా రాక ఇబ్బందులు పడుతున్నామని ఎస్సైతో రైతులు వాపోయారు. అనంతరం ఎస్సై మాట్లాడుతూ.. బస్తాలను మిల్లుకు తరలించడానికి లారీలను తెప్పించే బాధ్యత నాదే అని భరోసా కల్పించారు. కొనుగోలు కేంద్రానికి సరిపోను బార్దాన్ కూడా వచ్చేలా చొరవ చూపిస్తానని తెలిపారు. భారీ వర్షంతో ధాన్యం నేలపాలై నష్టపోయిన రైతులకు మనోధైర్యాన్ని కల్పించాడు.

యువత చెడు వ్యసనాలకు బానిస కావద్దు

యువత చెడు వ్యసనాలకు బానిసకావొద్దని పస్రా ఎస్సై అచ్చ కమలాకర్ అన్నారు. మండల పరిధిలోని రంగాపూర్ గ్రామంలో శుక్రవారం యువతకు పస్రా ఎస్సై కమలాకర్ వాలీబాల్ కిట్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎస్సై కమలాకర్ మాట్లాడుతూ.. యువత చెడు మార్గంలో ప్రయాణించకుండా క్రీడలను ఎంచుకోని ముందుకు సాగాలని అన్నారు. గ్రామంలోని యువతను క్రీడలపై ప్రోత్సహించాలనే ఉద్దేశ్యంతో వాలీబాల్ కిట్లను పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, గ్రామస్తులతో పాటు తదితరులు పాల్గొన్నారు.

ఇసుక రీచ్‌ల్లో నిబంధనలు పాటించాలి

- ఆదివాసీ సంక్షేమ పరిషత్ మండల అధ్యక్షుడు కృష్ణబాబు



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

వెంకటాపురం(కె): ఏజెన్సీ ప్రాంతంలోని ఇసుక రీచ్‌ల్లో ప్రభుత్వ నిబంధనలను పాటించాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ మండల అధ్యక్షుడు తుర్స కృష్ణబాబు అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని ఉప్పేడు వీరాపురం గ్రామంలో ఆదివాసీ సంక్షేమ పరిషత్ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏజెన్సీలో ఇసుక ర్యాంపుల్లో ప్రభుత్వ నిబంధనలను అతిక్రమించి రాత్రి పగలు తేడా లేకుండా ఇష్టారాజ్యంగా కాంట్రాక్టర్ టిప్పర్లు, పొక్లెయినర్ సహాయంతో ఇసుక తరలిస్తున్నారని అన్నారు. ఇసుక దోపిడి పలువురి రెవెన్యూ అధికారుల అండదండతోనే సాగుతోందని ఆరోపించారు. ఈ సమావేశంలో నాయకులు కంతి రవీంద్ర, తుర్స శంకర్, బొగ్గుల ప్రశాంత్, పూనెం రవీంద్ర, నర్సింహులు, నవదీప్ తదితరులు ఉన్నారు.

సమస్యల పరిష్కారానికి గ్రామసభ

- ఎస్సై తాజొద్దీన్



గామసభలో మాట్లాడుతున్న ఎస్సై తాజొద్దీన్

ఏటూరునాగారం: సమస్యల పరిష్కారానికి గ్రామసభలు ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్సై తాజొద్దీన్ అన్నారు. శుక్రవారం మండలంలోని రామన్నగూడెం, రోహీర్ గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి గ్రామస్తులను సమస్యలు అడిగి తెసుకున్నామన్నారు. ఆయా గ్రామాల్లో తాగునీరు, విద్యుత్, డ్రెయినేజీ వంటి సమస్యలను తమ దృష్టికి తీసుకువచ్చారని తెలిపారు. సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎస్సై తెలిపారు. గ్రామాల్లో గంజాయి, మత్తు పదార్థలకు ఎవరు బానిస కావొద్దన్నారు. ప్రభుత్వ నిషేధిత మాదక ద్రవ్యాలను వినియోగించిన విక్రయించిన చట్టపరంగా శిక్షలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువత పాల్గొన్నారు.

అన్ని వర్గాల ప్రజలకు న్యాయం



ఏటూరునాగారం: ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు



వెంకటాపురం(ఎం)లో..

వెంకటాపురం(ఎం): దేశవ్యాప్తంగా కులగణన నిర్వహిస్తామని ప్రధాని నరేంద్రమోదీ తీసుకున్న నిర్ణయంతో అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందని బీజేపీ మండలాధ్యక్షుడు పైడాకుల మల్లేశ్ తెలిపారు. కులగణన నిర్వహణపై కేంద్రం ప్రకటన చేయడంతో శుక్రవారం మండల కేంద్రంలో ప్రధాని నరేంద్రమోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాజ్‌కుమార్, సురేష్, రెడ్డి శ్రీను, మొగిలి, మహేష్, శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏటూరునాగారం: కులగణనతో అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందని ఓబీసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పల్ల బుచ్చయ్య అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట బీజేపీ మండల అధ్యక్షుడు చక్రవర్తి ఆధ్వర్యంలో ప్రధాని మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా బుచ్చయ్య మాట్లాడుతూ.. దేశంలోని అన్ని రాష్ట్రాల ప్రజలకు న్యాయం జరగాలంటే కులగణన తప్పనిసరి అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సంపత్, ఎర్రల్ల ఎల్లయ్య, నాగేశ్వరరావు, దుర్గారావు, కృష్ణ, ప్రశాంత్, శ్రీకాంత్, రాజు, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి పేదింటి ఆడబిడ్డలకు వరం

రేగొండ : పేదింటి ఆడబిడ్డలకు కల్యాణలక్ష్మి పథకం వరం లాంటిదని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో 47 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేద ప్రజల సంక్షేమమే ప్రజా ప్రభుత్వ ధ్యేయమన్నారు. పేదింటి ఆడపడుచులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకం అండగా ఉందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్లు వీరభద్రం, శ్వేత, డిప్యూటీ తహసీల్దార్ రజాక్, భూపాలపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ గూటోజు కిష్టయ్య, కోటంచ ఆలయ చైర్మన్ ముల్కనూరి భిక్షపతి, కాంగ్రెస్ జిల్లా, మండల నాయకులు పున్నం రవి, మేకల భిక్షపతి, బొజ్జం రవి, నాసాని రాంబాబు, విజేందర్, వెంకటస్వామి, పన్నాటి శ్రీను, వీరబ్రహ్మం, సుదర్శన్, రమేష్ పాల్గొన్నారు.